క్లుప్తంగా

నేడు వేణుగోపాలస్వామి కల్యాణం



రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి మూలవిరాట్

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని నందనపల్లె గ్రామ సమీపంలో వెలసిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వార్షిక కల్యాణోత్సవం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ పెద్దలు గురువారం తెలిపారు. స్వామి, అమ్మవార్ల దివ్య కల్యాణ మహోత్సవ కార్యక్రమానికి భక్తులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

ఘనంగా రంగల్ దర్వేశి తిరునాల

గడివేముల: మండలంలోని పరిధిలోని ఒండుట్ల గ్రామ సమీపంలోని ఎర్రమల కొండల్లో వెలసిన లక్ష్మీరంగనాయక స్వామి, రంగల్ దర్వేశిఖాద్రి స్వామివార్ల ఉత్సవాలు గురువారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. గని గ్రామంలో రంగనాయక స్వామివార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించి స్వామి వారి ఆలయానికి తీసుకెళ్లారు. అలాగే రంగల్ దర్వేశి ఖాద్రి స్వామికి గంధం కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి కులమతాలకు అతీతంగా భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీ నియామకం

కల్లూరు: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కల్లూరు మండల కమిటీని నియమిస్తూ గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. కల్లూరు మండల ఉపాధ్యక్షులుగా జి.నాగేశ్వరుడు, ఆర్.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శులుగా జి.మహేష్, దండు వాణి, జి.రంజిత్ కుమార్‌రెడ్డి, ఎస్.రామకృష్ణారెడ్డి, కార్యదర్శులుగా జి.కర్రెన్న, పి.రామ్మోహన్‌రెడ్డి, ఆర్.వెంకటరెడ్డి, కె.వరప్రసాద్ రెడ్డి, షేక్ మహమ్మద్ రఫి, కోశాధికారిగా కాశీ విశ్వనాథ్‌తో పాటు పలువురిని కార్యనిర్వాహక సభ్యులుగా నియమించారు.

తాగునీరు సక్రమంగా సరఫరా చేయాలి



అర్బన్ కాలనీల్లో తాగునీరు సక్రమంగా అందించాలని డిమాండ్ చేస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు: కల్లూరు అర్బన్ కాలనీలో రోజూ తాగునీరు అందించాలని సీపీఎం నగర నాయకులు యేసు డిమాండ్ చేశారు. గురువారం కల్లూరు అర్బన్ శరీన్ నగర్, బాలాజీ నగర్ తదితర కాలనీల్లో సీపీఎం ప్రతినిధుల బృందం పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కల్లూరు అర్బన్ ప్రాంతం రోజురోజుకు విస్తరిస్తోందని, అందుకు తగ్గట్లుగా మౌలిక వసతులు కల్పించడంతో పాటు తాగునీరు సక్రమంగా సరఫరా చేయాలన్నారు. సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు సుబ్బారెడ్డి, ప్రసాద్, నాగేంద్ర, రాముడు, వెంకటేష్, హనుమన్న, ఖాజ, రవి, మధు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ కేటాయింపులను నిరసిస్తూ 17న అర్ధనగ్న ప్రదర్శన



మాట్లాడుతున్న చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవస్వామి

కోడుమూరు రూరల్: చేనేత రంగానికి కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో నామమాత్రపు కేటాయింపులను నిరసిస్తూ ఈనెల 17న అర్ధనగ్న ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవస్వామి తెలిపారు. గురువారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా నాయకుల సమావేశంలో మాధవస్వామి మాట్లాడారు. చేనేత రంగానికి బడ్జెట్‌లో కేవలం రూ.115 కోట్లు కేటాయించడం తగదన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు చేనేత రంగాన్ని నిర్వీర్యం చేసే విధంగా ఉన్నాయన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి బడ్జెట్‌లో చేనేత రంగానికి ఎక్కువ నిధులు కేటాయించాలని, చేనేతలకు ఇచ్చిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్, జీఎస్టీ పూర్తి స్థాయి రద్దు హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. చేనేత రంగానికి జరుగుతున్న అన్యాయాలను నిరసిస్తూ అన్ని జిల్లా కేంద్రాల్లో చేపట్టనున్న అర్ధనగ్న ప్రదర్శనల్లో చేనేత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కర్రె శ్రీరాములు, మహబూబ్‌బాషా, నరసింహులు, సాయ నాగరాజు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

చెన్న సోమేశ్వరా.. పాహిమాం!



ఆలయ ప్రాంగణంలో ఫలహార బండ్ల కోలాహలం




స్వామివారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

- ఉత్సవాలకు పోటెత్తిన భక్తులు
- పూజలందుకున్న చెన్న సోమేశ్వర స్వామి
- నేడు మహారథోత్సవం

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో స్వయంభుగా వెలసిన చెన్న సోమేశ్వర స్వామి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. జిల్లా నలు మూలల నుంచేగాక పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు గురువారం ఆలయానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సి.బెళగల్, కంబదహాల్, సంగాల, పలుకుదొడ్డి, క్రిష్ణదొడ్డి, ముడుమాల, ఇనగండ్ల, మారందొడ్డి గ్రామాలకు చెందిన భక్తులు రంగుల కాగితాలు, మామిడి తోరణాలతో అలంకరించిన బండ్లలో ఫలహారాలతో ఆలయం చేరుకుని స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కోడుమూర్ సీఐ తబ్రేజ్ పర్యవేక్షించారు. సాయంత్రం గ్రామానికి చేరుకుని సి.బెళగల్ ఎస్‌ఐ తిమ్మారెడ్డితో బందోబస్త్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వేకువజాము నిర్వహించనున్న స్వామి వారి రథోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు, పూజారి తెలిపారు.

చెన్నసోమేశ్వర ఉత్సవాల సందర్భంగా శుక్రవారం ఉదయం 9 నుంచి అంతర్రాష్ట్ర ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం పాలపళ్ల ఎడ్ల బండ లాగుడు పోటీలు, శనివారం క్యాటగిరి సైజు ఎడ్ల బండలాగుడు పోటీలు ఉంటాయని, పోటీలలో పాల్గొనదలిచిన వారు పాలపళ్ల ఎద్దుల సైజు పోటీలకు రూ.600, క్యాటగిరి సైజు పోటీలకు రూ.800 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. వివరాలకు 7995919494, 9951861765 సంప్రదించాలన్నారు.





పూజలందుకున్న స్వామి, అమ్మవారి విగ్రహాలు

నేడు కార్యక్రమాలు

- పార్వతీ, గంగాదేవి సమేతుడైన చెన్నసోమేశ్వర స్వామి వారికి శుక్రవారం సాయంత్రం పారువేట ఉత్సవం నిర్వహించనున్నట్లు అర్చకుడు రమేషయ్య తెలిపారు.
- రాత్రి 9 గంటల అనంతరం స్వామి వారి సన్నిధిలో కళాకారుల తోలుబొమ్మలాట ఉంటుందని నిర్వాహకులు తెలియజేశారు.

నాటుసారా జోలికెళ్తే ఉపేక్షించం



పాణ్యం చెంచు కాలనీలో మాట్లాడుతున్న ఎక్సైజ్ డీఎస్పీ రాముడు

పాణ్యం: నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ డీఎస్పీ రాముడు హెచ్చరించారు. గురువారం పాణ్యం చెంచు కాలనీలో సర్పంచ్ మేకల పల్లవి అధ్యక్షతన గిరిజనులకు నవోదయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాటుసారా సేవించడం వల్ల అనేక అనర్థాలు ఉన్నాయన్నారు. ఎవరైనా సారా తయారుచేసినా, విక్రయించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీటిని ప్రోత్సహించిన వారికి సైతం శిక్షలు తప్పవన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి సంక్షేమ పథకాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు. పిల్లలను ఉన్నత చదువులు చదివించే భాధ్యతను తల్లిందండ్రులు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నవోదయం పథకంలో భాగంగా అందరూ కలిసికట్టుగా సారా నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. అలాగే చెంచుల జీవన విధానం, ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సీఐ కృష్ణమూర్తి, లక్ష్మణరావు, ఎస్‌ఐ బ్రహ్మయ్య, మాజీ జెట్పీటీసీ సభ్యురాలు నారాయణమ్మ, అఖిల, ఏఎస్‌ఐ నరసింహులు, వీఆర్‌ఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య తలెత్తనీయొద్దు

కోడుమూరు రూరల్: వేసవి దృష్ట్యా మండలంలోని గ్రామాల్లో ప్రజలకు మంచినీటి సమస్య తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని గూడూరు ఎంపీడీఓ శివనాగ ప్రసాద్ సూచించారు. గురువారం గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి సబీహా పర్వీన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సన, పంచాయతీ, ఇంజినీరింగ్ సిబ్బందితో ఎంపీడీఓ శివనాగప్రసాద్ నీటి సమస్య-నివారణ చర్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామంలో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. సుంకేసుల, ఎల్ఎల్‌సీ ద్వారా ముందుగానే ఆయా గ్రామాల్లోని నీటి కుంటలను నింపుకోవాలన్నారు. ఏవైనా మంచినీటి పథకాలు మరమ్మతులున్నట్లెతై వెంటనే నిధులు మంజూరు చేసి వాటిని బాగు చేయించుకోవాలని సూచించారు.



నీటి సమస్యపై అధికారులతో చర్చిస్తున్న ఎంపీడీఓ శివనాగప్రసాద్

భోగేశ్వరంలో ప్రత్యేక పూజలు

గడివేముల: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల అనంతరం గురువారం భోగేశ్వరంలో పదహారు రోజుల పండుగను వైభవంగా నిర్వహించారు. ఈఓ రామానుజన్ ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు శ్యాంసుందర్‌శర్మ విశేష పూజలు నిర్వహించారు. అందులో భాగంగా చండీశ్వరుడు, త్రిశూలదేవత అధ్వర్యంలో అంకురార్పణ చేసిన వాటికి ఉద్వాసన పలుకుతూ కోనేరులో కలిపారు. అనంతరం రథం వద్దకు చేరుకొని వివిధ ద్రవ్యాధిపూజలు నిర్వహించి రథాన్ని భక్తుల మధ్య రథ మండపంలోకి చేర్చారు. అమ్మవారికి చీర, సారెను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. పూజ కార్యక్రమాల్లో భక్తులు, సేవా కమిటీ పాల్గొన్నారు.



రథానికి పూజలు చేస్తున్న దృశ్యం

సలహాలను పరిగణలోకి తీసుకుంటాం

కర్నూలు (టౌన్): రాజకీయ పార్టీలు చేసే సూచనలు, సలహాలు, అభ్యంతరాలను పరిగణలోకి తీసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నగర పాలక కమిషనర్, కర్నూలు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.రవీంద్రబాబు స్పష్టం చేశారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం సాయంత్రం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతినెలా మొదటి వారంలో రాజకీయ పార్టీ ప్రతినిధుల సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు సమస్యలను లేవనెత్తారు. జొహరాపురం సమీపంలోని ఇందిరమ్మ కాలనీలో పోలింగ్ కేంద్రం లేక ఓటర్లు సుదూర ప్రాంతంలో ఉన్న 257, 268 పోలింగ్ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఇందిరమ్మ కాలనీలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని వివిధ రాజకీయ పార్టీల వారు విన్నవించారు. ఓటర్ల జాబితాలో చిరునామా, కొత్తగా ఇచ్చిన నగరపాలక ఇంటి నంబర్లు గందరగోళంగా ఉన్నాయని ఆర్‌ఓ దృష్టికి తెచ్చారు. తహసీల్దార్ వెంకటలక్ష్మీ, డీటీ ధనుంజయ్, సూపరింటెండెంట్ సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్రబాబు

ఎల్‌టీల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్య శాఖలో కీలకంగా పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ల (ఎల్‌టీ) సమస్యలు పరిష్కరించాలని ఏపీ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జీవీ సతీష్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2గా ఉద్యోగంలో చేరి అదే క్యాడర్‌లో రిటైర్ అవుతున్నారన్నారు. గ్రేడ్-2 క్యాడర్ సంఖ్యను 25 శాతం, గ్రేడ్-1 క్యాడర్‌ను 10 శాతం పోస్టులు పెంచాలని, ల్యాబ్ సూపర్‌వైజర్ పోస్టులు క్రియేట్ చేయాలని, అప్పుడే డయాగ్నోస్టిక్ సేవలు పటిష్టం అవుతాయన్నారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం అన్యాయమన్నారు. 2022 నుంచి పీహెచ్‌సీ, యుపీహెచ్‌సీలలో కొత్తపరికరాలు సమకూర్చారని, ఇందుకు అనుగుణంగా రెండవ ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు మంజూరు చేసి భర్తీ చేయాలని కోరారు.

ఆకట్టుకున్న అష్టావధానం

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని మిలి టరీ కాలనీ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం కర్నూలు చెందిన అష్టవధాని డాక్టర్ బోరెల్లి హర్ష నిర్వహించిన అష్టావధానం ఆకట్టుకుంది. ముఖ్య అథితిగా కర్నూలు జిల్లా డిప్యూటీ ఈఓ ఎస్.హనుమంతురావు పాల్గొన్నారు. అష్టావధాని డాక్టర్ బోరెల్లి హర్ష మాట్లడుతూ తెలగుభాష గొప్పతనానికి అష్టావధా నం ప్రతీకగా నిలుస్తోందన్నారు. జీవిత సవాళ్లను ఏ విధంగా ఎదుర్కోవాలో అష్టావధానం నేర్పిస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఏ.సుధాకర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి లక్ష్యాలు సాధించాలి

కర్నూలు(సెంట్రల్): నిర్దేశించిన లక్ష్యం మేరకు ఉపాధి పనులు కల్పించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. ఆయన గురువారం హౌసింగ్, స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర, ఉపాధి హామీ పనుల కల్పనపై మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు, ఏపీడీలు, ఏపీఓలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద రోజుకు లక్ష పనిదినాలను కల్పించాల్సి ఉండగా కేవలం 64 వేల మందికి మాత్రమే పనులు కల్పిస్తున్నారని, తుగ్గలి, వెల్దుర్తి, ఆదోని మండలాలు బాగా వెనుకబడి ఉన్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇళ్ల నిర్మాణాలకు ఇచ్చే అదనపు సాయంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

మైపర్‌లో జాబ్ మేళా

కర్నూలు సిటీ: మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో డీవీఎస్ ల్యాబ్ గురువారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఇందులో బీ-ఫార్మసీ, ఎం.ఫార్మసీ, బీటెక్ మెకానికల్, కెమికల్ డిపార్ట్‌మెంట్, బీఎస్సీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ, మైక్రోబయోలాజీ కోర్సులు పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొన్నారు. మేళాను ఆ కాలేజీ అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ ప్రారంభించి ప్రసంగించారు. జాబ్‌మేళాకు 200 మందికి పైగా విద్యార్థులు హాజరుకాగా వీరిలో 70 మంది అన్ని అర్హత పరీక్షల్లో నెగ్గి ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఉద్యోగాలు పొందిన వారందరికీ అభినందనలు తెలిపారు. డీవీఎస్ ప్రతినిధి హరికృష్ణ, నవీన్, ప్రిన్సిపాల్ మహాలక్ష్మీ, వైస్ ప్రిన్సిపాల్ కాకర్ల సురేష్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

కర్నూలు కల్చరల్: రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్లా, ఆర్‌యూ కన్వీనర్ రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం వర్సిటీలో విద్యార్థులతో కలిసి ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులు సర్టిఫికెట్స్‌ను పొందలేని పరిస్థితి నెలకొందని వాపోయారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా వర్సిటీల్లో ప్రవేశాలకు నిర్వహించే కామన్ పీజీ సెట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వివిధ సమస్యల పరిష్కారానికై ఈనెల 15వ తేదీన విజయవాడలో దీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆర్‌యూ కో కన్వీనర్ మౌలాలి, నాయకులు రాజు, సాగర్, కృపాకర్, శివ పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డులు, స్వీపర్లకు జీతాలివ్వాలి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పనిచేసే సెక్యూరిటీ గార్డులు, స్వీపర్లకు పెండింగ్ జీతాలు వెంటనే ఇవ్వాలని ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యంకు సీఐటీయూ నాయకులు నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు, నగర ఉపాధ్యక్షులు మైమూద్ గురువారం వినతి పత్రం సమర్పించారు. స్వీపర్లకు 4 నెలలు, సెక్యూరిటీ గార్డులకు 3 నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉండటం వల్ల కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీల నియామకం

కర్నూలు (రూరల్)/కోడుమూరు రూరల్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం మండల కమిటీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు మండల ఉపాధ్యక్షులుగా పి.నాగిరెడ్డి, బి.గోపాల్, ప్రధాన కార్యదర్శులుగా ఎస్.మహబూబ్ బాషా, పి.శేఖర్‌రెడ్డి, జి.వెంకటేశ్వర్లు, బోయ సురేంద్ర, కార్యదర్శులుగా వడ్ల రాజశేఖర్, ఎస్.భాస్కర్, ఎస్.మహబూబ్ పీర్ బాషా, కురువ కృష్ణ, దస్తగిరి, కోశాధికారిగా చంద్ర శేఖర్ రావును నియమించారు.

- కోడుమూరు మండల వైస్ ప్రెసిడెంట్లుగా ఎ.ప్రసాద్, కె.గిరిబాబు, జనరల్ సెక్రటరీలుగా ఎస్.కైలాస్‌పతి, కె.గిరిప్రసాద్, తిరుమలరెడ్డి, సంగాల రాజు, సెక్రటరీలుగా ఎం.మధుసూదన్‌రెడ్డి, ధనుంజయ, బోయ శ్రీరాములు, మద్దిలేటి, కె.సూర్యనారాయణ, ట్రెజరర్‌గా విజయభాస్కర్‌రెడ్డిలను నియమించారు.
- గూడూరు మండల వైస్ ప్రెసిడెంట్లుగా పంచలింగాల రంగారెడ్డి, కాశపోగు సుందరం, జనరల్ సెక్రటరీలుగా పెద్ద దౌలత్ బాషా, కురువ చిన్న మారెప్ప, ఎ.రాంభూపాల్‌రెడ్డి, లక్ష్మన్న, సెక్రటరీలుగా పింజరి హుసేనాశం, గొల్ల వెంకటేష్, సి.నాగరాజు, వి.క్రిష్ణారెడ్డి, చాకలి చిన్న అయ్యన్న, ట్రెజరర్‌గా బోయ రామచంద్రను నియమించారు.
- సి.బెళగల్ మండల వైస్ ప్రెసిడెంట్లుగా బి.మహానంది, లచ్చప్ప, జనరల్ సెక్రటరీలుగా ఎం.సోమిరెడ్డి, బి.రాఘవేంద్ర, జి.శోభన్, బి.మద్దిలేటి, సెక్రటరీలుగా ఎల్.సత్యపాల్‌రెడ్డి, ఎర్రపోగు శేఖర్‌బాబు, సందుల వాసు, కె.రాఘవేంద్ర, మల్లెపోగు సుంకన్న, ట్రెజరర్‌గా ఎం.వెంకటేష్‌లను నియమించారు.

ఉద్యోగులకు డీఏ, ఐఆర్ ప్రకటించాలి

గడివేముల: ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఉగాది కానుకగా డీఏ, ఐఆర్ ప్రకటించాలని ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు మానపాటి రవి, ఆవుల మునిస్వామి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గడివేములలో జరిగిన ఏపీటీఎఫ్ సమావేశంలో వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలైనా ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలు చేకూరలేదన్నారు. గత దసరా, సంక్రాంతి కానుకగా డీఏ ప్రకటిస్తారని ఎదురుచూసిన ఉపాధ్యాయ, ఉద్యోగులకు నిరాశ మిగిలిందని, కనీసం తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ కానుకగానైనా డీఏ ప్రకటించాలని కోరారు. 2023 జూలైతో 11వ పీఆర్సీ గడువు ముగిసినప్పటికీ 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడం సరైన పద్ధతి కాదని, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఇప్పటికే రెండు పీఆర్సీల కాలాన్ని కోల్పోయి ఉపాధ్యాయ, ఉద్యోగులు, పెన్షనర్లు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు ప్రతాపరెడ్డి, ప్రధాన కార్యదర్శి బాలస్వామి, రాష్ట్ర కౌన్సిలర్లు మహబూబ్ బాషా, నాగన్న, జిల్లా మహిళా కార్యదర్శి కవిత, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి

ఓర్వకల్లు: విద్యార్థులకు వడ్డించే మధ్యాన్న భోజనంలో నాణ్యత తప్పక పాటించాలని ఎంఈఓ-2 ఓంకార్‌యాదవ్ అన్నారు. గురువారం మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నన్నూరు గ్రామంలోని ఎంపీపీ మెయిన్ పాఠశాలతో పాటు, ఎస్సీ పాఠశాలలో తనిఖీ నిర్వహించారు. అనంతరం మీదివేముల జడ్పీహెచ్ఎస్ తోపాటు, ఎంపీపీ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. భోజనంలో వినియోగించే కూరగాయలు తాజాగా ఉండాలని, చిక్కీలు సక్రమంగా అందజేయాలన్నారు.



మీదివేములలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 ఓంకార్‌యాదవ్

పొదుపు సంఘాల్లో రాజకీయ జోక్యం తగదు

కర్నూలు(అగ్రికల్చర్): పొదుపు సంఘాల నిర్వహణలో రాజకీయ జోక్యాన్ని వెంటనే అదుపు చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా సంఘం అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరీ డిమాండ్ చేశారు. పత్తికొండలో మూడు నెలలుగా పొదుపు సంఘాల్లో పెరిగిపోయిన రాజకీయ జోక్యాన్ని నిరసిస్తూ గురువారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ చాంబరు ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. గ్రామైక్య సంఘంలో తెలుగు మహిళ తిష్ట వేసి పొదుపు సంఘాల స్ఫూర్తిని దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. గతంలో పనిచేసిన సీసీలు, ఏపీఎంలు అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడ్డారని, వారు చేసిన అక్రమాలకు కొద్ది నెలల క్రితం వరకు ఉన్న వీఓఏలను బాధ్యులను చేయడం అన్యాయమన్నారు. పొదుపు మహిళలకు న్యాయం జరగకపోతే ఉద్యమం తప్పదని స్పష్టం చేశారు. పొదుపుసంఘాల నిర్వహణలో తెలుగు మహిళ సాగిస్తున్న అక్రమాలపై విచారణ జరుపాలని, గతంలో అక్రమాలకు పాల్పడిన ఏపీఎం, సీసీలపై చర్యలు తీసుకోవాలని కోరారు.



డీఆర్‌డీఏ పీడీ చాంబర్ ఎదుట బైఠాయించిన మహిళలు

కవయిత్రి మొల్లమాంబకు నివాళి



నివాళులర్పిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): సంస్కృత రామాయణాన్ని తెలుగు భాషలోకి అనువదించిన తొలి తెలుగు కవయిత్రీ మొల్లమాంబ అని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తొలి తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతి పురస్కరించుకొని ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి కలెక్టర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వాల్మీకి రచించిన రామాయణాన్ని సంస్కృతం నుంచి సరళంగా అందరికీ అర్థమయ్యే రీతిలో తెలుగు భాషలోకి అనువదించిన మొల్లమాంబను స్మరించుకోవడం సంతోషంగా ఉందన్నారు. బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, సెట్కూరు సీఈఓ డాక్టర్ కె.వేణుగోపాల్ పాల్గొన్నారు.



మొల్లమాంబ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్వీ మోహన్ రెడ్డి

ఘనంగా మొల్లమాంబ జయంతి

కర్నూలు (టౌన్): వాల్మీకి రామాయణాన్ని తెలుగులో రాసిన తొలి కవయిత్రి, 16వ శతాబ్దానికి చెందిన కుమ్మరి శాలివాహన కులస్థులైన ఆతుకూరి మొల్లమాంబ జయంతి గురువారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి మొల్లమాంబ చిత్రపటానికి పూల మాలలు వేసి స్మరించుకున్నారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర నాయుడు, పట్టణ అధ్యక్షులు బబ్లూ, జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్, కార్పొరేటర్ మునెమ్మ, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీల ఆరోగ్యంపై అవగాహన

కర్నూలు(హాస్పిటల్): కిడ్నీల ఆరోగ్యంపై ప్రజలకు వైద్యులు అవగాహన కల్పించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సూచించారు. వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా గురువారం వైద్యశాలలోని ఓల్డ్ క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో నెఫ్రాలజీ విభాగం ఆధ్వర్యంలో నిరంతర వైద్యవిజ్ఞాన సదస్సు (సీఎంఈ) నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. అధిక సోడియం కలిగిన ఆహారం, కార్బొనేటెడ్ పానియాలు, ప్రాసెస్ చేసిన మాంసం మూత్రపిండాలకు హాని కలిగిస్తాయన్నారు. మంచి ఆరోగ్యానికి ప్రతిఒక్కరూ మంచి ఆహారం తీసుకోవడం, వ్యాయామం చేయాలన్నారు. కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మాట్లాడుతూ.. శరీర అవయవాల్లో కిడ్నీ ముఖ్య భాగమని, చెడు పదార్థాలను వేరు చేసి బయటకు విసర్జించేందుకు ఉపయోగపడుతుందన్నారు. అనంతరం 'లూపస్ నెఫ్రైటిస్ కరెంట్ ట్రీట్‌మెంట్ అండ్ వే ఫార్వర్డ్' అనే అంశంపై హైదరాబాద్ నుంచి విచ్చేసిన డాక్టర్ ఎ.శశికిరణ్ ప్రసంగించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, డాక్టర్లు సీతారామయ్య, పీఎన్.జిక్కి, అనంత్, వెంకట పక్కిరెడ్డి, శ్రీధర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ శశికిరణ్‌ను సన్మానిస్తున్న కేఎంసీ ప్రిన్సిపాల్ కె.చిట్టినరసమ్మ తదితరులు